# శ్రీ విద్యా భారతి కాన్వెంట్ 31వ వార్షికోత్సవ వేడుకలు..





గుంటూరు, పెన్ పవర్, ఏప్రిల్, 07, స్థానిక వసంతరాయపురం 3వలైను లోని పాఠశాలనందు ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిధులుగా నేషనల్ స్పైసెస్ బోర్డు డైరెక్టర్ కొత్తూరి వెంకట సుబ్బారావు, ఆంధ్రప్రదేశ్ బ్రాహ్మణ వెల్ఫేర్ కార్పొరేషన్ డైరెక్టర్ వెలగలేటి గంగాధర్, నేరెళ్ళ మాధవరావు మరియు కారశెట్టి రమేష్ పాల్గొనారు. ఈసందర్భంగా కొత్తూరి సుబ్బారావు మాట్లాడుతు పిల్లలు శ్రద్ధగా చదువుకొని జ్ఞానాన్ని సంపాదించి ఉన్నత శిఖరాలకు చేరుకోవాలని కోరారు. వెలగలేటి గంగాధర్ మాట్లాడుతూ విద్యార్థులు చదువుతో పాటు క్రమశిక్షణ ఆటలలో కూడా రాణించాలని శారీరకంగా మానసికంగా విద్యార్థులు దృఢంగా ఉండాలని తెలిపారు. తదుపరి విద్యార్థులకు ఆటల పోటీలు వ్యాసరచన, డిబెట్, డ్రాయింగ్, సింగింగ్ ఫ్యాన్సీ డ్రెస్ పోటీలలో విజేతలకు బహుమతి ప్రధానం చేశారు. పాఠశాల డైరెక్టర్ కె.సి.వై. రాజేష్ నాయుడు, ప్రిన్సిపల్ కె.అరుణ కుమారి మరియు ఉపాధ్యాయినులు, విద్యార్థిని విద్యార్థులు పాల్గొన్నారు.

# వేసవి కాలంలో గుంటూరు నగర వ్యాప్తంగా త్రాగునీటి ఎద్దడి తలెత్తకుండా అధికారులు చర్యలు తీసుకోవాలి..



గుంటూరు, పెన్ పవర్, ఏప్రిల్, 07, ప్రజలకు ఎక్కడా నీటి కొరత లేకుండా చూసేందుకు ఇప్పటికే రూ.2.7 కోట్ల అంచనాలతో 'సమ్మర్ యాక్షన్ ప్లాన్' రూపొందించినట్లు నగర కమిషనర్ కె.మయూర్ అశోక్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ సమ్మర్ యాక్షన్ ప్లాన్ ని తక్షణమే క్షేత్రస్థాయిలో అమలు చేయాలని, ఎక్కడైనా నీటి సమస్య తలెత్తితే సంబంధిత ఇంజినీరింగ్ అధికారులే వ్యక్తిగత బాధ్యత వహించాల్సి ఉంటుందని స్పష్టం చేశారు. నగరంలోని ప్రతి ప్రాంతానికి సమృద్ధిగా నీరు అందడమే ఈ యాక్షన్ ప్లాన్ యొక్క ముఖ్య ఉద్దేశ్యమన్నారు. ఇప్పటికే నగరవ్యాప్తంగా 206 ప్రాంతాల్లో 823 పాయింట్స్ వద్ద పైపు లైన్లు డ్రైనేజీ కాలువల మీదుగా వెళ్తున్నట్లు గుర్తించారని, కలుషిత నీటి ముప్పు పొంచి ఉన్న డ్రైన్ క్రాస్ లైన్లను తక్షణమే తొలగించి వాటి స్థానంలో కొత్తవి ఏర్పాటు చేయాలని నిర్ణయించామన్నారు. ప్రతి రోజు త్రాగునీటి సరఫరా సమయంలో ప్రతి ఎమినిటి కార్యదర్శి 10కి తగ్గకుండా నీటి శ్యాంపిల్స్ ల్లో క్లోరిన్ తగుమోతాదులో ఉండేలా పరిశీలించి, ప్రతి శ్యాంపిల్ రిపోర్ట్ ని ఏపీసిఎంఎం యాప్ లో అప్ లోడ్ చేయాలని, ఏఈలు, డిఈఈలు పర్యవేక్షించాలన్నారు. నూతనంగా పైపులైన్లు అవసరమైన ప్రాంతాల్లో వాటి ఏర్పాటు కోసం రూ.1 కోటి నిధులను సిద్ధంగా ఉంచామన్నారు. భూగర్భ జలాల వినియోగాన్ని సమర్థవంతంగా వాడుకోవడంలో భాగంగా, నూతన పవర్ బోర్ వెల్స్ ఏర్పాటుకు రూ.50 లక్షలు, ప్రస్తుతం ఉన్న బోర్ వెల్స్ మరమ్మతులకు రూ.40 లక్షలు కేటాయించడం జరిగిందని, అన్నింటినీ అందుబాటులోకి తీసుకురావాలని ఇంజినీరింగ్ అధికారులను ఆదేశించారు. విలీన ప్రాంతాల్లో త్రాగునీటి సమస్య తలెత్తకుండా ఉండేందుకు ప్రత్యామ్నాయ ఏర్పాట్లలో భాగంగా, 6 ప్రత్యేక నీటి ట్యాంకర్లను నిరంతరం సిద్ధంగా ఉంచాలని, త్రాగునీటి సరఫరా జరగని ప్రాంతాలకు యుద్ధ ప్రాతిపదికన సరఫరా చేయాలని అధికారులకు స్పష్టం చేశామన్నారు. ప్రజల దాహార్తిని తీర్చే లక్ష్యంతో నగరంలోని రద్దీగా ఉండే 20 ప్రధాన కేంద్రాల్లో చలివేంద్రాలను ఏర్పాటు చేయాలని ఉత్తర్వులు జారీ చేశామన్నారు. ఎండ తీవ్రత నుండి ఉపశమనం కలిగించేందుకు నగరంలోని రద్దీగా ఉండే నాలుగు ప్రధాన కూడళ్లలో సిగ్నల్ పడే చోట గ్రీన్ మ్యాట్ షెడ్లను ఏర్పాటు చేయనున్నామని పేర్కొన్నారు. నగరంలోని ప్రతి రిజర్వాయర్ ని నిర్దేశిత కాలపరిధిలో శుభ్రం చేయాలన్నారు. వేసవి కాలం ముగిసే వరకు త్రాగునీటి సరఫరా విభాగం సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని, ఉండవల్లిలోని ప్రధాన పంపింగ్ కేంద్రం వద్ద అవసరమైతే అదనపు మోటార్లను ఏర్పాటు చేయడానికి సిద్ధంగా ఉండాలని, పైపులైన్ల లీకేజీలు, కలుషిత నీటి సరఫరాపై ప్రజల నుండి వచ్చే ఫిర్యాదులను 24 గంటల్లోగా పరిష్కరించాలని ఆదేశించారు.

# ఆరోగ్యమే మహా భాగ్యము..అత్తోట పోతురాజు..




గుంటూరు, పెన్ పవర్,ఏప్రిల్, 07, గుడ్ షెఫర్డ్ కాన్వెంట్ సిస్టర్స్ స్వచ్ఛంద సంస్థ వారి చైల్డ్ ప్రొటెక్షన్ ప్రాజెక్టు లో భాగంగా తాడేపల్లి మండలం ప్రాతూరు గ్రామంలో ఉన్న కిశోర బాలికల గ్రూప్ సభ్యులకు వరల్డ్ హెల్త్ డే గురించి అవగాహన కార్యక్రమం ఏర్పాటు చేయటం జరిగింది,ఈ కార్యక్రమాన్ని ఉద్దేశించి గుడ్ షెఫర్డ్ కాన్వెంట్ చైల్డ్ ప్రొటెక్షన్ ప్రాజెక్ట్ తాడేపల్లి మండల కమ్యూనిటీ ఆర్గనైజర్ అత్తోట పోతురాజు మాట్లాడుతూ ప్రతి సంవత్సరం ఏప్రిల్ 7న ప్రపంచ ఆరోగ్య సంస్థ ఇతర సంబంధిత అనుబంధ సంస్థల ప్రాయోజకత్వంలో జరుపుకునే ప్రపంచ ఆరోగ్య దినోత్సవం అని ఇది మొదట 1948లో,మొదటి ప్రపంచ ఆరోగ్య సభను ఏర్పాటు చేసిందని , అప్పటి నుండి 1950 వ సంవత్సరం నుండి ప్రపంచ ఆరోగ్య దినోత్సవంగా ప్రతి సంవత్సరం ఏప్రిల్ 7 ను జరుపుకోవాలని అసెంబ్లీ నిర్ణయించిందని ప్రతి సంవత్సరం ప్రపంచ ఆరోగ్యానికి ప్రధాన ప్రాముఖ్యత ఉన్న అంశంపై ప్రపంచవ్యాప్త దృష్టిని ఆకర్షించేటట్లు ఈ సంస్థ చూస్తుందని ప్రపంచ ఆరోగ్య దినోత్సవాన్ని వివిధ ప్రభుత్వాలు, ప్రభుత్వేతర సంస్థలు ప్రజా ఆరోగ్య సమస్యలపై ఆసక్తితో వివిధ కార్యకలాపాలను నిర్వహిస్తారని గ్లోబల్ హెల్త్ కౌన్సిల్ వంటి మీడియా నివేదికలలో వారి మద్దతును ప్రముఖంగా ప్రకటిస్తున్నారని ఎనిమిది అధికారిక ప్రపంచ ఆరోగ్య ప్రచారాలలో ప్రపంచ క్షయవ్యాధి దినోత్సవం, ప్రపంచ రోగనిరోధక వారోత్సవం, ప్రపంచ మలేరియా దినోత్సవం, ప్రపంచ పొగాకు వ్యతిరేక దినోత్సవం, ప్రపంచ ఎయిడ్స్ దినోత్సవం, ప్రపంచ రక్తదాత దినోత్సవం, ప్రపంచ హెపటైటిస్ దినోత్సవంతో పాటు ప్రపంచ ఆరోగ్య దినోత్సవాన్ని కూడా చేర్చారు అని ప్రపంచ ఆరోగ్య దినోత్సవం 2026 సంవత్సరం ఒక థీమ్ ప్రకటించింది అని, ప్రజలు, జంతువులు, మొక్కలు మరియు భూగోళం యొక్క ఆరోగ్యాన్ని పరిరక్షించడానికి శాస్త్రీయ సహకారం యొక్క శక్తిని చాటిచెప్పే ఆరోగ్యం కోసం కలిసికట్టుగా విజ్ఞానానికి అండగా నిలబడదాం అనే ఇతివృత్తంతో ప్రపంచాన్ని ఏకం చేసిందని తెలిపారు. అనంతరం పెద్దిపాగ అనీల్ కుమార్ మాట్లాడుతూ పిల్లలు ఆరోగ్యకరమైన జీవనశైలిని కలిగి ఉండటానికి గల ప్రధానమైన విషయాలు ఏమనగా ఆరోగ్యకరమైన మంచి ఆహారం అంటే పండ్లు మరియు కూరగాయలు, తృణధాన్యాలు, మరియు పాల ఉత్పత్తులతో సహా కొవ్వు తక్కువగా ఉండే ప్రోటీన్ పదార్థాలను తినడం,కొవ్వు,చక్కెర మరియు ఫాస్ట్ ఫుడ్ ను ఎక్కువగా తినకపోవడం, సమతుల్యమైన, విభిన్నమైన ఆహారం ఈ రోజులలో చాలా అవసరం అని ఆరోగ్యకరమైన ఆహారం నుండి గరిష్ట ప్రయోజనం పొందడానికి, పిల్లలు రోజుకు 6-8 గ్లాసుల నీరు త్రాగాలి, రోజుకు కనీసం 60 నిమిషాల వ్యాయామం చేయాలి మరియు తగినంత నిద్రపోవాలి, అప్పుడే ఆరోగ్యం గా ఉంటారు అని తెలిపారు.

అనంతరం నేలటూరి నాగమణి మాట్లాడుతూ కిశోర బాలికలలో 10-19 సంవత్సరాల వయస్సు ఆడపిల్లలు రక్తహీనత అనేది భారతదేశంలో, ముఖ్యంగా గ్రామీణ మరియు తక్కువ ఆదాయ వర్గాలలో ఒక ప్రధాన ప్రజారోగ్య సమస్యగా ఉందని ఈ దశలో శారీరక మార్పులు, రుతుస్రావం మరియు పోషకాహార లోపం వల్ల రక్తంలో హిమోగ్లోబిన్ శాతం పడిపోతుందని కిశోర బాలికల లో రక్తహీనత లోపానికి ముఖ్య కారణం ఏమనగా భారతదేశంలో దాదాపు 50-60% పైగా కౌమార బాలికలు ఏదో ఒక రకమైన రక్తహీనతతో బాధపడుతున్నారు, దీనికి ప్రధాన కారణం: ఐరన్ లోపం, అసమతుల్య ఆహారం మరియు రుతుస్రావం వల్ల అధిక రక్త నష్టం జరిగి ప్రాణాపాయ స్థితి ఏర్పడవచ్చు కాబట్టి ఆడపిల్లలు మంచి ఆహారం తీసుకోవడం అవసరం అని అన్నారు. ఈ కార్యక్రమంలో బాలల పార్లమెంట్ చెందిన పిల్లలు,గుడ్ షెఫర్డ్ కాన్వెంట్ సిస్టర్స్ స్వచ్ఛంద సంస్థ సిబ్బంది అత్తోట పోతురాజు, అనిల్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

# మట్టి ఖర్చులకు ఫ్రెండ్స్ ఆర్గనైజేషన్ చేయుత



పెన్ పవర్ బ్యూరో బాపట్ల ఏప్రిల్ 7: పేదలకు చేయూతని అందించడానికి ఫ్రెండ్స్ ఆర్గనైజేషన్ ఎల్లప్పుడూ ముందుంటుందని గౌరవాధ్యక్షుడు వేజండ్ల శ్రీనివాసరావు చెప్పారు. పిట్టలవానిపాలెం మండలం రెడ్డిపాలెం పంచాయతీ భవనం వారి పాలెం గ్రామానికి చెందిన పల్లిక పాపారావు అనే కార్మికుడు అనారోగ్యంతో మృతి చెందారు. బాధిత కుటుంబానికి మట్టి ఖర్చులకు తమ ఆర్గనైజేషన్ ద్వారా తక్షణ సాయం అందించడం జరిగిందన్నారు. ఆర్గనైజేషన్ సభ్యుడు శ్రీరామ్ సునీల్ మాట్లాడుతూ వృత్తిరీత్యా బాపట్ల ఫుడ్ అండ్ సైన్స్ కళాశాలలో వాచ్మెన్ గా పనిచేస్తూ ముగ్గురు పిల్లలను పోషించుకొంటూ జీవనం సాగిస్తున్నాడని ఆయన భార్య కూడా 12 సంవత్సరాల క్రితం మృతి చెందినట్లు తెలిపారు. వారి కుటుంబానికి చేయూతను అందించడానికి ఫ్రెండ్స్ ఆర్గనైజేషన్ తరుపున చిరు సహాయాన్ని అందజేశామన్నారు మరింత మంది ఆపద్బాంధవుడు ముందుకు వచ్చి వారి కుటుంబానికి చేయూతను అందించాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో ట్రెజరర్ సువర్ణ రాజు, ఒటికొండల లక్ష్మణరావు తన్నీరు గోపి తదితరులు పాల్గొన్నారు.

# పెన్ పవర్
## సెంట్రల్ ఆంధ్ర

కృష్ణా జిల్లా । ఎన్.టి.ఆర్. జిల్లా । గుంటూరు జిల్లా । పల్నాడు జిల్లా । బాపట్ల జిల్లా

# ఈ నెల 11, 12 తేదీల్లో వాటర్ స్పోర్ట్స్ నిర్వహణ పోస్టర్లను ఆవిష్కరించిన జిల్లా కలెక్టర్ డా. జి.లక్ష్మీశ..




విజయవాడ, పెన్ పవర్, ఏప్రిల్, 07, శాప్ లీగ్స్ -- 2026 కార్యక్రమంలో భాగంగా ఈ నెల 11, 12 తేదీలలో విజయవాడలోని పున్నమి ఘాట్ వద్ద వాటర్ స్పోర్ట్స్ పోటీలు నిర్వహించనున్నట్లు జిల్లా కలెక్టర్ డా. జి.లక్ష్మీశ తెలిపారు. ఈ క్రీడలకు సంబంధించిన పోస్టర్లను ఆయన జిల్లా క్రీడా ప్రాధికార సంస్థ అధికారులతో కలిసి మంగళవారం కలెక్టరేట్ లో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం క్రీడల అభివృద్ధికి ప్రత్యేక ప్రాధాన్యం ఇస్తోందని చెప్పారు. యువతలో క్రీడాస్ఫూర్తిని పెంపొందించేందుకు ఇలాంటి కార్యక్రమాలు దోహదపడతాయని పేర్కొన్నారు. శాప్ లీగ్స్ లో భాగంగా వివిధ విభాగాల్లో పోటీలు నిర్వహిస్తున్నట్లు వెల్లడించారు. జిల్లా క్రీడల అభివృద్ధి అధికారి కె. కోటేశ్వరరావు మాట్లాడుతూ ఈ వాటర్ స్పోర్ట్స్ పోటీలు రాష్ట్ర స్థాయి ఈవెంట్‌గా సబ్ జూనియర్, జూనియర్ విభాగాల్లో బాలురు, బాలికల కేటగిరీల్లో నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా క్రీడా ప్రాధికార సంస్థ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

# పిడుగురాళ్ల వైద్య కళాశాలకు వేగంగా సిబ్బంది నియామకాలు.. మెడికల్ కాలేజ్ ప్రిన్సిపాల్ డా. సుందరాచారి.



గుంటూరు, పెన్ పవర్, ఏప్రిల్, 07, రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా తీసుకున్న పిడుగురాళ్ల వైద్య కళాశాలను ఈ విద్యా సంవత్సరంలోనే ప్రారంభించేందుకు చర్యలు వేగవంతమయ్యాయి. ఆరోగ్య శాఖ మంత్రి ఆదేశాల మేరకు సిబ్బంది నియామక ప్రక్రియను త్వరితగతిన పూర్తి చేయడానికి ఏర్పాట్లు జరుగుతున్నాయని మెంటర్ కళాశాల గుంటూరు మెడికల్ కాలేజ్ ప్రిన్సిపాల్ డా. సుందరాచారి తెలిపారు. జనరల్ అటెండర్ ఉద్యోగాల నుండి సైకియాట్రిక్ సోషల్ వర్కర్ వరకు సుమారు 200కు పైగా ఖాళీలకు 4,000కు పైగా దరఖాస్తులు వచ్చాయని ఆయన వెల్లడించారు. ఈ నియామకాలు అవుట్‌సోర్సింగ్ మరియు కాంట్రాక్ట్ విధానంలో భర్తీ చేయనున్నట్లు తెలిపారు. ప్రస్తుతం మెరిట్ జాబితా తయారీ పనులు కొనసాగుతున్నాయని, ఈ నెల 13వ తేదీన ప్రాథమిక మెరిట్ జాబితాను అధికారిక వెబ్‌సైట్‌లో విడుదల చేయడానికి చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. అనంతరం అభ్యంతరాలు (గ్రీవెన్సులు) స్వీకరించి తుది జాబితాను ప్రకటించిన తరువాత నియామకాలు చేపడతామని చెప్పారు. మెరిట్ జాబితా పూర్తిగా నిష్పక్షపాతంగా ఉండేలా చర్యలు తీసుకోవాలని గుంటూరు మెడికల్ కాలేజ్ సిబ్బందికి సూచనలు ఇచ్చినట్లు తెలిపారు. ఇందుకు పర్యవేక్షణ కోసం కొంతమంది ప్రొఫెసర్లను నియమించినట్లు పేర్కొన్నారు. ఈ సందర్భంగా డా. సుందరాచారి మాట్లాడుతూ, మొత్తం నియామక ప్రక్రియ అత్యంత పారదర్శకంగా నిర్వహించబడుతుందని, ఎవరూ ఎక్కడా డబ్బులు చెల్లించి ఉద్యోగం పొందేందుకు ప్రయత్నించి మోసపోవద్దని హెచ్చరించారు. దళారులను నమ్మి మోసపోకూడదని, ఎలాంటి ప్రలోభాలకు లోనవ్వకుండా జాగ్రత్తగా ఉండాలని అభ్యర్థులకు సూచించారు.

# ఉద్యమం రిజిస్ట్రేషన్ పై అవగాహన సదస్సు..




విజయవాడ, పెన్ పవర్, ఏప్రిల్, 07, కేంద్ర ప్రభుత్వ రైజింగ్ అండ్ యాక్సిలరేటింగ్ ఎంఎస్ఎంఈ పెర్ఫార్మెన్స్ (ర్యాంప్) కార్యక్రమంలో భాగంగా జిల్లా పరిశ్రమల కేంద్రం ఆధ్వర్యంలో కలెక్టర్ డా. జి.లక్ష్మీశ ఆదేశాలతో, జిల్లా పరిశ్రమల అధికారి పి.మధు మార్గ నిర్దేశంతో పెనుగంచిప్రోలు ఎంపీడీవో కార్యాలయంలో మంగళవారం ఉద్యమ్ రిజిస్ట్రేషన్, ఎంఎస్ఎంఈ పథకాలపై ప్రత్యేక అవగాహన సదస్సు జరిగింది. ఈ కార్యక్రమానికి ఔత్సాహిక పారిశ్రామికవేత్తలు, స్వయం సహాయక సంఘాల మహిళలు, చిరు వ్యాపారులు హాజరయ్యారు. ఉద్యమ్ పోర్టల్‌లో రిజిస్ట్రేషన్ ప్రక్రియపై ప్రత్యక్ష అవగాహన కల్పించారు. కొత్తగా పరిశ్రమల యూనిట్లు ప్రారంభించే వారికి ప్రధానమంత్రి ఉపాధి కల్పన పథకం కింద తయారీ రంగానికి రూ. 50 లక్షలు, సేవా రంగానికి రూ. 20 లక్షలు వరకు రుణాలు లభిస్తాయని పారిశ్రామిక ప్రోత్సాహక అధికారి ఎన్‌వీ సత్యనారాయణ వివరించారు. ముఖ్యంగా మహిళలు, ప్రత్యేక వర్గాల వారికి గ్రామీణ ప్రాంతాల్లో 35 శాతం వరకు రాయితీ వర్తిస్తుందన్నారు. అదేవిధంగా ఉద్యమ్ రిజిస్ట్రేషన్ వల్ల బ్యాంకుల నుంచి పూచీకత్తు లేని రుణాలు పొందేందుకు అవకాశముంటుందని వివరించారు. ఎంఎస్ఎంఈ అండ్ ఆంత్ర ప్రెన్యూర్షిప్ డెవలప్మెంట్ పాలసీ (2024-29) విధానం వల్ల కలిగే ప్రయోజనాల గురించి వివరించారు. నిరుద్యోగ యువత ప్రస్తుతం అందుబాటులో ఉన్న వివిధ పథకాలను సద్వినియోగం చేసుకొని ముందడుగు వేయాలని సూచించారు. మహిళలు స్వయం ఉపాధి ద్వారా పారిశ్రామిక యూనిట్లు నెలకొల్పి తమతో పాటు మరో పదిమందికి ఉపాధి అవకాశాలు కల్పించడం ద్వారా వచ్చే సంతృప్తి వెలకట్టలేనిదని ఎంపీడీవో జి.శ్రీను, ఏపీఎం కేవీ రమణ అన్నారు. సెర్ప్ ద్వారా అందుతున్న ప్రయోజనాలు, ఆర్థిక సహాయం గురించి వివరించారు. ఒక కుటుంబం - ఒక పారిశ్రామికవేత్త లక్ష్యాలకు అనుగుణంగా ప్రతి ఒక్కరు కృషిచేయాలని పేర్కొన్నారు.

# సూర్యలంక తీరంలో అభివృద్ధి పనులు వేగవంతం : బాపట్ల ఎంపి తెన్నేటి కృష్ణప్రసాద్




బాపట్ల : పెన్ పవర్, ఏప్రిల్, 07: బాపట్ల పార్లమెంట్ సభ్యులు తెన్నేటి కృష్ణప్రసాద్ మంగళవారం సూర్యలంక తీర ప్రాంతంలో జరుగుతున్న పలు అభివృద్ధి పనులను అధికారులతో కలిసి క్షేత్రస్థాయిలో మంగళవారం పరిశీలించారు. గత మార్చి నెలలో పనులను పర్యవేక్షించిన ఆయన, మొత్తం రూ.97.52 కోట్ల వ్యయంతో సూర్యలంక తీర ప్రాంతాన్ని పర్యాటక కేంద్రంగా తీర్చిదిద్దే పనుల పురోగతిని తెలుసుకునేందుకు మళ్ళీ ఈరోజు సందర్శించారు. నిర్మాణ పనులలో రాజీపడకుండా, నాణ్యతా ప్రమాణాలను పాటిస్తున్నారో లేదో ఆయన స్వయంగా తనిఖీ చేశారు.

# ప్రజలకు సూచన పానిక్ బుకింగ్ చేయవద్దు...

విజయవాడ, పెన్ పవర్, ఏప్రిల్, 07, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో ఎల్పీజీ నిల్వలు సరిపడా ఉన్నాయని, ప్రజలెవరూ ఆందోళనతో బుకింగ్స్ చేయొద్దని శ్రీ భాస్కర రెడ్డి - జీఎమ్-ఎస్ఎల్సీ, విజయవాడ రిటైల్ ఆర్ఓ, హెచ్‌పిసిఎల్ కోరారు. కేంద్ర సమాచార, ప్రసార మంత్రిత్వ శాఖకు చెందిన పత్రికా సమాచార కార్యాలయం, విజయవాడ (పిఐబి) ఆధ్వర్యంలో పశ్చిమాసియాలో నెలకొన్న ఉద్రిక్తతల నేపథ్యంలో రాష్ట్రంలో గ్యాస్ నిల్వలు, సరఫరా, బ్లాక్ మార్కెటింగ్ నిరోధానికి చేపడుతున్న చర్యలపై విలేకరుల సమావేశం నిర్వహించారు. గ్యాస్ సరఫరాలో ప్రజలకు ఎలాంటి అంతరాయాలు కలగకుండా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు తీసుకుంటున్న చర్యల గురించి తెలియజేశారు.

సమావేశంలో వెల్లడించిన అంశాలు:

గృహ వినియోగ గ్యాస్ సరఫరాలో అంతరాయం కలగకుండా చూసేందుకు ప్రారంభంలో వాణిజ్య సిలిండర్ల సరఫరాను పెట్రోలియం మంత్రిత్వ శాఖ ఆదేశాల మేరకు 20% కి పరిమితం చేసినప్పటికీ, ప్రస్తుతం పరిస్థితి మెరుగుపడటంతో గత వినియోగంలో సగటున 70% వరకు సరఫరా చేస్తున్నాం.

పాఠశాలలు, ఆసుపత్రులు, రైల్వే క్యాంటీన్లతో పాటుగా రాష్ట్రంలోని అన్ని అన్నా క్యాంటీన్లకు పూర్తి స్థాయిలో వాణిజ్య సిలిండర్ల సరఫరా జరుగుతుంది.

గ్యాస్ బుకింగ్, డెలివరీ:

గతంలో ఆందోళనలతో కూడిన బుకింగ్స్ వల్ల రోజుకు 5 లక్షల వరకు బుకింగ్స్ జరిగేవి, కానీ ప్రస్తుతం ఇది సాధారణ స్థితికి చేరుకుని రోజుకు 2 లక్షల నుంచి 2.20 లక్షల బుకింగ్స్ జరుగుతున్నాయి.

చమురు కంపెనీలు రోజుకు 2,30,000 నుంచి 2,40,000 సిలిండర్లను సరఫరా చేస్తున్నాయి.

బుకింగ్స్ ఎక్కువగా ఉంటుండడం వల్ల కొన్ని చోట్ల డెలివరీ ఒకటి, రెండు రోజులు ఆలస్యం అవుతున్నాయి. అంతే కానీ, సరఫరాలో ఎలాంటి ఆటంకాలు లేవు.

ఎల్పీజీ సరఫరా దుర్వినియోగాన్ని నిరోధించేందుకు ఓటీపీ ఆధారిత డెలివరీలకు ప్రాధాన్యతనిస్తున్నాం. ఈ రోజు వరకు ఓటీపీ ఆధారిత డెలివరీలు 90% నికి చేరుకున్నాయి. దీనిని 100% కి చేర్చడమే లక్ష్యంగా చర్యలు చేపట్టాం.

రాష్ట్రంలో హెచ్పిసిఎల్ రిఫైనరీ ఉండటం వల్ల క్రూడ్ ఆయిల్ సరఫరాలో ఎటువంటి అంతరాయం లేదు. ఇతర రాష్ట్రాలతో పోలిస్తే ఏపీ మెరుగైన స్థితిలో ఉంది

వైజాగ్ నుండి గెయిల్ పైప్‌లైన్ ద్వారా నిరంతరాయ గ్యాస్ సరఫరా జరుగుతోంది.

పైప్డ్ న్యాచురల్ గ్యాస్ మరియు సబ్సిడీ:

భవిష్యత్తులో గ్యాస్ సరఫరాలో ఇలాంటి ఇబ్బందుల్ని తగ్గించేందుకు పైప్డ్ న్యాచురల్ గ్యాస్ కనెక్షన్లను కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రోత్సహిస్తున్నాయి.

మౌలిక సదుపాయాలు అందుబాటులో ఉన్న చోట ప్రజలు, పరిశ్రమలు పైప్డ్




గ్యాస్ కనెక్షన్‌లు తీసుకోవాలని ప్రజలను ప్రభుత్వం కోరుతోంది.

హోటళ్లు, రెస్టారెంట్లు, భారీ పరిశ్రమలు వంటివి పైప్డ్ నేచురల్ గ్యాస్ ( పి ఎన్ జి) కనెక్షన్‌లకు మారాలని ప్రభుత్వం విజ్ఞప్తి చేస్తోంది.

ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఆదేశాలతో రాష్ట్రంలో దీపం పథకం కింద అందిస్తున్న ఎల్‌పిజి సబ్సిడీని పైప్‌లైన్ న్యాచురల్ గ్యాస్‌కు కూడా వర్తింపజేయాలని నిర్ణయించారు. పౌర సరఫరా శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ కూడా ఈ విషయంపై స్పష్టతనిచ్చారు.

నల్లబజారుపై చర్యల

అక్రమ నిల్వలు, బ్లాక్ మార్కెటింగ్ ను అడ్డుకునేందుకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కఠిన చర్యలు చేపట్టాయి. జిల్లా స్థాయిలో టాస్క్ ఫోర్స్‌లను ఏర్పాటు చేసి నిరంతరం పరిస్థితిని పర్యవేక్షిస్తున్నాం.

బ్లాక్ మార్కెటింగ్‌ను అరికట్టడానికి రాష్ట్ర ప్రభుత్వం ఇప్పటివరకు 1079 తనిఖీలు నిర్వహించి, 4,300 సిలిండర్లను సీజ్ చేసింది.

ప్రజలకు సూచన

పానిక్ బుకింగ్ చేయవద్దు. సోషల్ మీడియాలో వచ్చే తప్పుడు వార్తలను నమ్మొద్దని, ప్రభుత్వ అధికారిక సమాచారాన్ని మాత్రమే విశ్వసించాలని అధికారులు సూచించారు. గ్యాస్ బుకింగ్ రద్దీని నియంత్రించడానికి పట్టణ ప్రాంతాల్లో బుకింగ్ వ్యవధిని 21 రోజుల నుండి 25 రోజులకు, గ్రామీణ ప్రాంతాల్లో 45 రోజులకు మార్చడం జరిగింది. పానిక్ బుకింగ్స్ వల్ల ప్రస్తుతం డెలివరీకి 4 నుండి 6 రోజులు సమయం పడుతోంది; పౌరులు ఆందోళన చెందవద్దని, గోడౌన్ల దగ్గరకు వెళ్లాల్సిన అవసరం లేదని, ఆన్‌లైన్ ద్వారానే బుక్ చేసుకోవాలని కోరుతున్నాము.

# అకాల వర్షాలపై అధికారులు అప్రమత్తంగా ఉండాలి..జిల్లా కలెక్టర్ డా. జి. లక్ష్మీశ..

విజయవాడ, పెన్ పవర్, ఏప్రిల్, 07 ప్రస్తుతం వాతావరణ పరిస్థితుల నేపథ్యంలో జిల్లాలో అకాల వర్షాలు కురిసే అవకాశమున్నందున అన్ని శాఖల అధికారులు అప్రమత్తంగా ఉండాలని జిల్లా కలెక్టర్ డా. జి.లక్ష్మీశ ఆదేశించారు. మంగళవారం కలెక్టరేట్‌లోని శ్రీ ఏవీఎస్ రెడ్డి హాల్ నుంచి విజయవాడ నగరపాలక సంస్థతో పాటు వివిధ శాఖల అధికారులతో కలెక్టర్ లక్ష్మీశ టెలీ కాన్ఫరెన్స్ నిర్వహించారు. రాష్ట్రంలోని పలు ప్రాంతాల్లో భారీ వర్షాలు, పిడుగులు, వడగండ్ల వానలు నమోదవుతున్న నేపథ్యంలో నిర్లక్ష్యానికి తావులేకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలని సూచించారు. మున్సిపల్, పంచాయతీ శాఖలు డ్రైనేజీ వ్యవస్థలపై ప్రత్యేక దృష్టిపెట్టాలని, భారీ వర్షాల కారణంగా ఎక్కడైనా నీరు నిల్వ ఉండే పరిస్థితి ఏర్పడితే వెంటనే చక్కదిద్దేలా సిద్ధంగా ఉండాలని ఆదేశించారు. రెవెన్యూ, పోలీస్, విద్యుత్, ఆర్ అండ్ బీ తదితర శాఖలు అత్యవసర పరిస్థితుల్లో తక్షణమే స్పందించేలా సిద్ధంగా ఉండాలన్నారు. ఏవైనా అత్యవసర పరిస్థితులు తలెత్తినప్పుడు స్థానిక అధికారులను వెంటనే సంప్రదించాలని ప్రజలకు సూచించారు. అదేవిధంగా కలెక్టరేట్‌లో ఏర్పాటు చేసిన కమాండ్ కంట్రోల్ సెంటర్ (91549 70454) ద్వారా కూడా సమాచారం అందించవచ్చని తెలిపారు. వ్యవసాయ శాఖ అధికారులు రైతులకు తగిన సూచనలు ఇవ్వాలని, పంటలకు నష్టం కలగకుండా జాగ్రత్తలు తీసుకునేలా చూడాలన్నారు. ముఖ్యంగా మిర్చి రైతులను అప్రమత్తం చేయాలని కళ్లాల్లోని మిర్చిని జాగ్రత్తగా భద్రపరచుకునేలా సహాయసహకారాలు అందించాలన్నారు. భారీ వర్షాల సమయంలో ప్రజలు ఇళ్లలోనే ఉండాలని సూచించారు. నీరు నిలిచిన ప్రాంతాల్లో నడవడం



లేదా వాహనాలు నడపడం ప్రమాదకరమని, ఓపెన్ డ్రైన్లు, మ్యాన్‌హోల్స్ వద్ద ప్రత్యేక జాగ్రత్తలు తీసుకోవాలని తెలిపారు. పిడుగులు పడే సమయంలో చెట్లు, విద్యుత్ స్తంభాలు, హోర్డింగ్‌లు, ఓపెన్ ప్రదేశాల వద్ద నిలవకూడదని, సురక్షిత ప్రాంతాల్లో ఆశ్రయం పొందాలని సూచించారు. తెగిన విద్యుత్ తీగలు కనిపించినప్పుడు వాటికి దగ్గరగా వెళ్లకుండా వెంటనే సంబంధిత అధికారులకు సమాచారం ఇవ్వాలని కలెక్టర్ లక్ష్మీశ తెలిపారు.

# అమరావతికి చట్టబద్ధత.. ఆంధ్రప్రదేశ్ దీర్ఘకాలిక అభివృద్ధి, ఆర్థిక స్థిరత్వాలకు స్పష్టత : ప్రత్తిపాటి

**రాష్ట్ర శాశ్వత రాజధానిగా అమరావతిని ప్రకటించడంపై తెలుగుజాతిలో హర్షాతిరేకాలు.**

**హైకోర్టు న్యాయవాదుల విజయోత్సవ ర్యాలీలో మాజీమంత్రి ప్రత్తిపాటి.**

చిలకలూరిపేట రూరల్, పెన్ పవర్, ఏప్రిల్ 07: చిలకలూరిపేట : అమరావతికి చట్టబద్ధత కల్పిస్తూ గెజిట్ విడుదల చేయడం పట్ల యావత్ తెలుగుజాతి హర్షాతిరేకాలు వ్యక్తం చేస్తోందని, రాష్ట్ర ఏకైక రాజధానిగా అమరావతికి కల్పించిన చట్టబద్ధత.. రాష్ట్ర అభివృద్ధికి స్థిరమైన స్పష్టతకు నాంది పలికిందని మాజీమంత్రి, శాసనసభ్యులు ప్రత్తిపాటి పుల్లారావు అభిప్రాయపడ్డారు.

ఆంధ్రప్రదేశ్ రాజధానిగా అమరావతికి అధికారిక గుర్తింపు లభించడాన్ని స్వాగతిస్తూ, హైకోర్టు న్యాయవాదుల జేఏసీ కన్వీనర్, న్యాయవాది లక్ష్మీనారాయణ ఆధ్వర్యంలో హైకోర్టు లాయర్లు నిర్వహించిన విజయోత్సవ ర్యాలీలో శాసనమండలి మాజీ స్పీకర్ షరీఫ్, ఎమ్మెల్యేలు, చైర్మన్లు, కూటమి నాయకులతో కలిసి ప్రత్తిపాటి పాల్గొన్నారు. వెలగపూడిలోని హైకోర్టు సిబ్బంది క్వార్టర్స్ నుంచి హైకోర్టు ప్రాంగణం వరకు మంగళవారం జరిగిన ర్యాలీలో ప్రత్తిపాటి, రాజధాని రైతులు, మహిళలతో కలిసి ముందుకు సాగారు. అనంతరం ఏర్పాటు చేసిన సభలో కేక్ కటింగ్ చేశారు. అనంతరం ఆయన విలేకరులతో మాట్లాడారు.

ఏపీ రాజధానిగా అమరావతికి లభించిన చట్టపరమైన గుర్తింపు.. రాజధానికి దక్కిన హోదాతో ఏప్రిల్ 6కు



ప్రత్యేక గుర్తింపు లభించిందన్నారు. కేంద్రం జారీ చేసిన గెజిట్ నోటిఫికేషన్ ప్రకారం ఆంధ్రప్రదేశ్ పునర్వ్యవస్థీకరణ(సవరణ) చట్టంతో 2024 జూన్ 2 నుంచే ఏపీ కొత్త రాజధానిగా, ప్రజా రాజధాని అమరావతి నిలిచిందన్నారు.

రాష్ట్ర రాజధానిగా అమరావతికి లభించిన గుర్తింపుతో ఆంధ్రప్రదేశ్ దీర్ఘకాలిక అభివృద్ధి, స్థిరత్వాలకు స్పష్టత చేకూరిందన్నారు. పరిపాలనలో సౌలభ్యం, పెట్టుబడుల ఆకర్షణ, పెట్టుబడిదారులకు నమ్మకంతో కూడిన భరోసా లభించడంతో పాటు.. రాష్ట్ర ప్రధాన అభివృద్ధి కేంద్రంగా అమరావతి నిలవనుందని ప్రత్తిపాటి పేర్కొన్నారు.

గత పాలకుల అమరావతి విధ్వంసమే లక్ష్యంగా సాగించిన కుట్రలకు వ్యతిరేకంగా నాడు న్యాయవాదులు ప్రత్యక్షంగా, పరోక్షంగా సాగించిన పోరాటానికి నేడు నిజమైన ఫలితం దక్కిందని ప్రత్తిపాటి చెప్పారు. రాష్ట్ర ఏకైక రాజధానిగా అమరావతిని ప్రకటించడం వెనక ముఖ్యమంత్రి చంద్రబాబు, ఉపముఖ్యమంత్రి పవన్ కల్యాణ్, మంత్రి నారా లోకేశ్ ల నిరంతర కృషి, పట్టుదల, ప్రధాని మోదీ, కేంద్రప్రభుత్వ పెద్దల సహాయ సహకారాలు దాగి ఉన్నాయన్నారు. ఈ కార్యక్రమంలో టిడిపి సమన్వయకర్త నెల్లూరి సదాశివరావు, మార్కెట్ యార్డ్ చైర్మన్ షేక్ కరిముల్లా, మండల అధ్యక్షులు జవ్వాజి మధన్ మోహన్, కామినేని సాయిబాబు, తదితరులు పాల్గొన్నారు.

# శాస్త్రీయ దృక్పథంతో జలధారకు ముందడుగు..జిల్లా కలెక్టర్ డా. జి.లక్ష్మీశ..





విజయవాడ, పెన్ పవర్, ఏప్రిల్, 07, రాష్ట్ర ప్రభుత్వం గౌరవ ముఖ్యమంత్రి దార్శనికతకు అనుగుణంగా నీటి భద్రత-సాగునీటి సంఘాల బాధ్యత ద్వారా 100 రోజుల కార్యాచరణకు శ్రీకారంచుట్టిందని.. ఈ నేపథ్యంలో శాస్త్రీయ దృక్పథంతో జలధార కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కలెక్టర్ డా. జి.లక్ష్మీశ సమన్వయ శాఖల అధికారులను ఆదేశించారు. కలెక్టర్ లక్ష్మీశ అధ్యక్షతన శ్రీ పింగళి వెంకయ్య సమావేశ మందిరంలో జలధారపై మంగళవారం సన్నద్ధత సమావేశం జరిగింది. ఈ సందర్భంగా కలెక్టర్ లక్ష్మీశ మాట్లాడుతూ జీవో ఎంఎస్ నెం.10కు అనుగుణంగా ఇరిగేషన్, గ్రామీణ నీటి సరఫరా, గ్రౌండ్ వాటర్, పశుసంవర్ధక, ఉద్యాన తదితర శాఖల అధికారులు ఒక బృందంగా కార్యక్రమాన్ని విజయవంతం చేసేందుకు కృషిచేయాలన్నారు. ముఖ్యంగా సూక్ష్మ సేద్యానికి జీవనాడులు అయిన చెరువుల అభివృద్ధికి తద్వారా భూగర్భ జలాల వృద్ధికి కృషిచేయాలన్నారు. జిల్లాలో దాదాపు 450 చెరువులకు సంబంధించి ప్రస్తుత స్థితి, మెరుగుపరిచేందుకు కార్యాచరణ ముఖ్యమన్నారు. పదేళ్ల గణాంకాలను విశ్లేషించుకొని పనులు చేపట్టాల్సిన ఉంటుందన్నారు. ఏప్రిల్ 15 వరకు చేపట్టాల్సిన పనుల గుర్తింపు, ఆపై పనుల మంజూరు, పనుల పూర్తి, డాక్యుమెంటేషన్ ప్రక్రియపై దృష్టిసారించాల్సిన అవసరముందన్నారు. సాగునీటి సంఘాలు, ప్రజా భాగస్వామ్యంతో జల వనరుల అభివృద్ధి, నీటి భద్రతకు కృషిచేయాలన్నారు. జులై 14 వరకు జరిగే కార్యక్రమాన్ని విజయవంతం చేసేందుకు జిల్లా, మండల, గ్రామస్థాయిలో ప్రత్యేక కమిటీలను ఏర్పాటు చేస్తున్నట్లు వివరించారు. భావితరాలకు భద్రమైన నీటి వనరులను బహుమతిగా ఇచ్చే ఈ బృహత్తర కార్యక్రమం ద్వారా చెరువులు-కాలువల పునరుద్ధరణ, చెరువుల అనుసంధానం, నీటి సంరక్షణ విధానాలు, పచ్చదనం పెంపొందించడం, గ్రామ నీటి బడ్జెట్ లక్ష్యాలతో ఈ కార్యక్రమాలను నిర్వహించనున్నట్లు కలెక్టర్ లక్ష్మీశ వివరించారు. సమావేశంలో జిల్లా నీటి వనరుల అధికారి (డీడబ్ల్యూఆర్‌వో) పి.రామచంద్రరావు, గ్రామీణ నీటి సరఫరా ఎస్ఈ డి.బాలశంకర్‌రావు, జిల్లా పశు సంవర్ధక అధికారి డా. ఎం.హనుమంతరావు, జిల్లా ఉద్యాన అధికారి పి.బాలాజీ కుమార్, ఇరిగేషన్‌తో పాటు వివిధ సమన్వయ శాఖల అధికారులు పాల్గొన్నారు.

# నీటి వనరుల సద్వినియోగంతోనే ప్రగతి సాధ్యం : ప్రత్తిపాటి

**వర్షపు నీటి నిల్వలపై రైతాంగం అవగాహన పెంచుకోవాలి.**

**తాగు...సాగునీటి చెరువులు, కుంటల నిర్వహణను నిర్లక్ష్యం చేయకండి.**


**మైదవోలు, కారుచోల గ్రామప్రజలకు నీటి సంరక్షణ చర్యలపై అవగాహన కల్పించిన మాజీమంత్రి.**

**కారుచోలలో రూ.10లక్షలతో నిర్మించే సీసీరోడ్డు, డ్రైన్ కు ఎమ్మెల్యే శంకుస్థాపన.**

చిలకలూరిపేట రూరల్, పెన్ పవర్, ఏప్రిల్ 07: యడ్లపాడు : ప్రతి నీటి బొట్టును, ప్రకృతి వనరుల్ని సక్రమంగా సద్వినియోగం చేసుకున్నప్పుడే, నిజమైన ప్రగతి సాధ్యమవుతుందని, తక్కువ నీటితో ఎక్కువ దిగుబడి సాధించడంపై రైతాంగం దృష్టి పెట్టాలని, కొన్ని దేశాల్లో నీటియుద్ధాలే జరుగుతున్నాయని, అటువంటి పరిస్థితి రాకూడదంటే నీటిభద్రతపై ప్రతి ఒక్కరూ దృష్టిపెట్టాలని మాజీమంత్రి, శాసనసభ్యులు ప్రత్తిపాటి పుల్లారావు సూచించారు. మంగళవారం ఆయన నీటి భద్రత -- సాగునీటి సంఘాల బాధ్యత కార్యక్రమంలో భాగంగా, యడ్లపాడు మండలం కారుచోల, మైదవోలు గ్రామాల్లో పర్యటించి, స్థానికులకు నీటి సంరక్షణపై అవగాహన కల్పించారు. కారుచోలలో రూ.10 లక్షలతో నిర్మించ తలపెట్టిన సీసీరోడ్డు, డ్రైన్లకు ప్రత్తిపాటి శంకుస్థాపన చేశారు. అనంతరం గ్రామస్తుల్ని ఉద్దేశించి ప్రసంగించారు.

దొరకనప్పుడే నీటి విలువ తెలుస్తుంది.

చంద్రబాబు నాయుడు ఎప్పుడు ముఖ్యమంత్రిగా ఉన్న సాగునీటి నిల్వలపై ప్రత్యేక దృష్టి పెడతారని, దానిలో భాగంగానే గతంలో చెక్ డ్యాములు, నీటి కుంటలు, ఇంకుడు గుంతలు నిర్మించారని ప్రత్తిపాటి చెప్పారు. నీరు పుష్కలంగా ఉ



న్నప్పుడు రైతులకు ఇబ్బంది ఉండదని, అది దొరకనప్పుడే దాని విలువ తెలుస్తుందన్నారు. ప్రతి రైతు.. తక్కువ నీటితో ఎక్కువ దిగుబడులు సాధించడంపై దృష్టి సారించాలని, డ్రిప్, మైక్రో ఇరిగేషన్ వ్యవస్థతో సాగులో ఉత్తమ ఫలితాలు సాధించవచ్చని ప్రత్తిపాటి స్పష్టం చేశారు. రైతన్నా మీకోసం కార్యక్రమమైనా, ఇప్పుడు చేపట్టిన నీటి భద్రత అంశమైనా ప్రతీది తమ బాగకోసమేననే నిజాన్ని రైతాంగం గ్రహించాలన్నారు. తమకు అందుబాటులో ఉండే చెరువులు, నీటి కుంటలు, ఇతర నీటి వనరుల్ని రైతాంగం ఎల్లప్పుడూ పరిరక్షించుకోవాలని ప్రత్తిపాటి సూచించారు. నీటి భద్రతలో భాగంగా అధికారుల సూచనలు, సలహాల్ని రైతులు, ప్రజలు తప్పనిసరిగా ఆచరణలో పెట్టాలన్నారు.

కార్యక్రమంలో టీడీపీ సమన్వయకర్త నెల్లూరి సదాశివరావు, మార్కెట్ యార్డ్ చైర్మన్ షేక్ కరిముల్లా, మండల అధ్యక్షులు కామినేని సాయిబాబు, జవ్వాజి మధన్ మోహన్, జిల్లా రైతు అధ్యక్షులు మద్దూరి వీరారెడ్డి, టీడీపీ నాయకులు కందిమల్ల రఘురామారావు, మద్దూరి శ్రీనివాస రెడ్డి, వీరాంజనేయులు, బోడ వెంకట కోటయ్య, మునాఫ్ , సద్దాం, షేక్ జిలానీ, ఎమ్మార్వో, ఎంపీడీవో లు, అధికారులు గ్రామ నాయకులు, కార్యకర్తలు, తదితరులు పాల్గొన్నారు.

# తన అసమర్ధతను కప్పిపుచ్చుకోవడానికే జగన్.. ఏబీఎన్ ఆంధ్రజ్యోతిపై దాడులు చేయిస్తున్నాడు : ప్రత్తిపాటి

**ప్రజా భీష్టాన్ని గుర్తించలేనివాడు..మీడియా సంస్థల సలహాలు,సూచనలు గౌరవించలేని వాడు రాజకీయాలకు అనర్హుడు : ప్రత్తిపాటి**

చిలకలూరిపేట రూరల్, పెన్ పవర్, ఏప్రిల్ 07: చిలకలూరిపేట : తన పిచ్చిప్రతిపాదన మావిగన్ ను సొంతపార్టీ నేతలే వ్యతిరేకించడం.. దాంతో ప్రజల్లో తాను మరింత అభాసుపాలవుతానన్న అక్కసు, ద్వేషంతో పాటు, తన అసమర్ధతను కప్పిపుచ్చుకోవడానికే జగన్ ఏబీఎన్, ఆంధ్రజ్యోతి సంస్థలపై వైసీపీ శ్రేణుల్ని దాడులకు పురికొల్పాడు. పత్రికాస్వేచ్ఛను అరచేతితో అడ్డుకునే జగన్ ప్రయత్నాలు ఎప్పటికీ నెరవేరవు. అదికారంలో ఉన్నప్పుడు కూడా జగన్ ఇదేవిధంగా తప్పుడు రాతల నెపంతో జీవో నంబర్ 2430 ద్వారా మీడియా సంస్థల గొంతు నులిమే ప్రయత్నం చేసి, తన పతనానికి తానే బీజం వేసుకున్నాడు. ఒక పత్రిక, ఛానల్ యజమానిగా చలామణి అవుతున్న జగన్.. మీడియా సంస్థల ఔన్నత్యాన్ని, గొప్పతనాన్ని గుర్తించలేకపోవడం నిజంగా సిగ్గుచేటు.

ఏబీఎన్ ఆంధ్రజ్యోతి కథనాలు..రాతలు నిప్పు కణికలు

ప్రజాస్వామ్య మూలస్తంభాల్లో ఒకటైన మీడియా వ్యవస్థల సలహాలు, సూచలను గౌరవించలేని వాడు. ప్రజా భీష్టాన్ని గుర్తించలేని వాడు, సత్యాన్ని.. నిజాన్ని అంగీకరించలేని వాడు ముమ్మాటికీ రాజకీయాలకు అనర్హుడే. ఏబీఎన్-ఆంధ్రజ్యోతి సంస్థ రాతలు.. వాటి యజమాని రాధాకృష్ణ పలుకులు కణకణమండే నిప్పుకణికలు. వాటిని గుప్పెట్లో దాచేసి, ప్రజల్ని ఏమార్చాలనే జగన్ ప్రయత్నాలు తనతో పాటు..



తన పార్టీని జనాగ్రహ జ్వాలలకు మసిచేస్తాయి. " అని మాజీమంత్రి ప్రత్తిపాటి మంగళవారం ఒక ప్రకటనలో స్పష్టం చేశారు.

# చిలకలూరిపేటలో గ్యాస్ మాఫియా సెగ

## సామాన్యుడికి కష్టాలు.. హోటళ్లకు సిలిండర్లు!

## మాజీ కౌన్సిలర్ అబ్దుల్ రౌఫ్

చిలకలూరిపేట రూరల్, పెన్ పవర్, ఏప్రిల్ 07: చిలకలూరిపేట: పట్టణంలో గృహ వినియోగ గ్యాస్ సిలిండర్ల పంపిణీ అస్తవ్యస్తంగా మారిందని, పేద ప్రజలకు అందాల్సిన సిలిండర్లు దర్జాగా బ్లాక్ మార్కెట్‌కు తరలిపోతున్నాయని మాజీ కౌన్సిలర్ అబ్దుల్ రౌఫ్ మండిపడ్డారు. గ్యాస్ ఏజెన్సీల నిర్వాహకులు, కొందరు అధికారులు కుమ్మక్కై సామాన్యులను ఇబ్బందులకు గురిచేస్తున్నారని ఆయన ఆరోపించారు.

మాజీమంత్రి శాసనసభ్యులు ప్రత్తిపాటి పుల్లారావు హెచ్చరించినా మారని తీరు

గతంలో మాజీ మంత్రి,శాసనసభ్యులు ప్రత్తిపాటి పుల్లారావు గ్యాస్ ఏజెన్సీ నిర్వాహకులను, డెలివరీ బాయ్స్‌ను కఠినంగా హెచ్చరించారు. సామాన్య మానవుడికి కేటాయించిన గృహ వినియోగ సిలిండర్లు వారికే అందాలని, హోటళ్లు మరియు వ్యాపార సంస్థలు కేవలం కమర్షియల్ సిలిండర్లనే వాడాలని ఆయన స్పష్టమైన ఆదేశాలు ఇచ్చారు. అయితే, స్వయంగా శాసనసభ్యులు ప్రత్తిపాటి పుల్లారావు ఆదేశించినప్పటికీ, గ్యాస్ ఆఫీస్ వారు ఏమాత్రం భయం లేకుండా అక్రమాలకు పాల్పడుతున్నారని రౌఫ్ విమర్శించారు. వారికి ఎమ్మెల్యే అన్నా, నిబంధనలన్నా గౌరవం లేదని ధ్వజమెత్తారు.

అధికారుల తనిఖీలు ఒక ప్రహసనం

ఇటీవల విజిలెన్స్ అధికారులు చేసిన తనిఖీలపై అబ్దుల్ రౌఫ్ విస్మయం వ్యక్తం చేశారు. పట్టణం మొత్తం మీద కేవలం మూడు సిలిండర్లు పట్టుకోవడం హాస్యాస్పదమని, అధికారులు చిత్తశుద్ధితో తనిఖీలు చేయడం లేదని ఆరోపించారు. "నాతో కలిసి వస్తే పట్టణంలో వందల సంఖ్యలో అక్రమ సిలిండర్లను పట్టిస్తాను" అని ఆయన అధికారులకు సవాల్ విసిరారు. అధికారులు కేవలం డబ్బులకు ఆశపడి, నామమాత్రపు దాడులతో సరిపెడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు.

ఆఫీసుల్లో సామాన్యుడికి బెదిరింపులు.. విఆర్ ఏ లకు వీఐపీ ట్రీట్మెంట్!

తాను స్వయంగా ఇండియన్ గ్యాస్ ఆఫీసులో గమనించిన అక్రమాలను రౌఫ్ వివరించారు. సామాన్యులు వెళ్లి సిలిండర్ అడిగితే 'వస్తాయి.. వెళ్ళండి' అంటూ



సిబ్బంది బెదిరించి పంపిస్తున్నారని, అదే సమయంలో తన కళ్లముందే ఇద్దరు విఆర్ ఏ ల వద్ద వెయ్యి రూపాయలు తీసుకొని వెంటనే స్లిప్పులు రాసి సిలిండర్లు ఇచ్చారని ఆయన వెల్లడించారు. తాను గ్యాస్ బుక్ చేసి 12 రోజులు గడుస్తున్నా ఇంతవరకు డెలివరీ చేయలేదని, సామాన్యుడి పరిస్థితి ఇంత దారుణంగా ఉందని వాపోయారు.

పై అధికారుల జోక్యానికి డిమాండ్

నర్ల బజార్ వంటి ప్రాంతాల్లో గృహ వినియోగ సిలిండర్లు హోటళ్లు, కర్రీ పాయింట్లకు యథేచ్ఛగా సరఫరా అవుతున్నాయని, దీనివల్ల సామాన్యుడు వారాల తరబడి నిరీక్షించాల్సి వస్తోందని ఆయన అన్నారు. ఈ అక్రమాలపై జిల్లా పౌర సరఫరా అధికారి , ఆర్డీఓ తక్షణమే స్పందించి విచారణ చేపట్టాలని, అక్రమాలకు పాల్పడుతున్న గ్యాస్ ఏజెన్సీలపై కఠిన చర్యలు తీసుకోవాలని రౌఫ్ డిమాండ్ చేశారు. ఎమ్మెల్యే ప్రత్తిపాటి పుల్లారావు ఆశయాలకు విరుద్ధంగా పనిచేస్తున్న వారిపై చర్యలు తీసుకోవాలని ఆయన కోరారు.

# భక్తిశ్రద్ధలతో పోలేరమ్మ, అంకమ్మ తల్లి తిరుణాళ్లు

## ముఖ్యఅతిథిగా పాల్గొన్న ప్రదాత మండలనేని చరణ్ తేజ



చిలకలూరిపేట రూరల్, పెన్ పవర్, ఏప్రిల్ 07: నాదెండ్ల మండలం గణపవరం గ్రామంలోని పడమర బజార్ వద్ద వేంచేసియున్న శ్రీ పోలేరమ్మ తల్లి మరియు అంకమ్మ తల్లి తిరుణాళ్లు అత్యంత వైభవంగా జరిగాయి. ఈ వేడుకల్లో భాగంగా నిర్వహించిన అన్నదాన కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా ప్రదాత యువ నాయకులు మండలనేని చరణ్ తేజ హాజరయ్యారు.ముందుగా ఆలయానికి చేరుకున్న చరణ్ తేజకు ఆలయ కమిటీ సభ్యులు ఘన స్వాగతం పలికారు. అమ్మవార్లను దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించిన అనంతరం, ఆయన భక్తులకు స్వయంగా అన్నప్రసాదాన్ని పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆలయ కమిటీ వారు చరణ్ తేజను దుశ్శాలువాతో ఘనంగా సత్కరించారు.గ్రామస్తులు, భక్తులు భారీ సంఖ్యలో పాల్గొనడంతో పడమర బజార్ ప్రాంతం ఆధ్యాత్మిక శోభతో సంతరించుకుంది. భక్తులకు ఎటువంటి ఇబ్బందులు కలగకుండా ఆలయ కమిటీ సభ్యులు అన్ని ఏర్పాట్లను పర్యవేక్షించారు.

# క్రీడలతోనే ఉజ్వల భవిష్యత్తు

## నరసరావుపేట ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవింద బాబు








నరసరావుపేట పెన్ పవర్ ఏప్రిల్ 07,: స్థానిక సత్తెనపల్లి రోడ్డులోని డాక్టర్ కోడెల శివప్రసాదరావు స్టేడియంలో పవర్ లిఫ్టింగ్ ఛాంపియన్షిప్ 2025-26 పోటీలు ఆచార్య నాగార్జున యూనివర్సిటీ మరియు వాగ్దేవి కాలేజీ మరియు డిస్టిక్ స్పోర్ట్స్ అథారిటీ సాప్ వారి ఆధ్వర్యంలో మంగళవారం ఘనంగా నిర్వహించబడ్డాయి. ఈ కార్యక్రమానికి నరసరావుపేట శాసనసభ్యులు డాక్టర్ చదలవాడ అరవింద బాబు ముఖ్య అతిథిగా విచ్చేసి, క్రీడా జ్యోతిని వెలిగించి పోటీలను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ క్రీడలు మనిషికి క్రమశిక్షణను, పట్టుదలను నేర్పుతాయని, యువత సెల్ ఫోన్లకు పరిమితం కాకుండా మైదానాల్లోకి వచ్చి తమ నైపుణ్యాన్ని చాటాలని పిలుపునిచ్చారు. నరసరావుపేట ప్రాంతం నుంచి పవర్ లిఫ్టింగ్ వంటి క్రీడల్లో యువత ఉత్సాహంగా పాల్గొనడం అభినందనీయమని, క్రీడాకారులకు అవసరమైన అన్ని సౌకర్యాలను కల్పించేందుకు ప్రభుత్వం సిద్ధంగా ఉందని ఆయన పేర్కొన్నారు. దివంగత నేత కోడెల శివప్రసాదరావు క్రీడల అభివృద్ధికి చేసిన కృషిని స్మరిస్తూ, ఈ స్టేడియం వేదికగా మరిన్ని రాష్ట్ర స్థాయి, జాతీయ స్థాయి పోటీలు నిర్వహించేలా చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. అనంతరం వివిధ విభాగాల్లో ప్రతిభ కనబరిచిన క్రీడాకారులకు ఎమ్మెల్యే మెడల్స్ మరియు ప్రశంసా పత్రాలను అందజేసి, వారిని అభినందించారు. ఈ కార్యక్రమంలో క్రీడా సంఘాల ప్రతినిధులు, వాగ్దేవి కాలేజీ యాజమాన్యం స్టేడియం కోచ్ నరసింహారెడ్డి ఆచార్య నాగార్జున యూనివర్సిటీ కోచ్‌లు, తెలుగుదేశం పార్టీ నాయకులు మరియు పెద్ద సంఖ్యలో క్రీడాకారులు పాల్గొన్నారు.

# అడుగు రైతు కోసం.. చూపు పశుసంపద రక్షణ కోసం

## పశువైద్య శిబిరాల్లో పాల్గొన్న నరసరావుపేట ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవింద బాబు





నరసరావుపేట పెన్ పవర్ ఏప్రిల్ 07: రైతు సంక్షేమమే ధ్యేయంగా, నిరంతరం ప్రజాక్షేత్రంలో ఉంటూ ప్రజా పక్షపాతిగా అడుగులు వేస్తున్న నరసరావుపేట శాసనసభ్యులు డాక్టర్ చదలవాడ అరవింద బాబు మరోసారి తన సేవా దృక్పథాన్ని చాటుకున్నారు. పశువుల ఆరోగ్య రక్షణ ద్వారానే గ్రామీణ ఆర్థిక వ్యవస్థ బలోపేతం అవుతుందని ఆకాంక్షిస్తూ, నియోజకవర్గంలో పశు వ్యాధి నివారణ కార్యక్రమాలకు ఆయన శ్రీకారం చుట్టారు. నరసరావుపేట మండలం అర్వపల్లి గ్రామంలో పశుసంవర్ధక శాఖ ఆధ్వర్యంలో మంగళవారం నిర్వహించిన జాతీయ పశు వ్యాధి నియంత్రణ కార్యక్రమం (నాడీసీపీ ) లో ఎమ్మెల్యే ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. పశువులకు గాలికుంటు వ్యాధి ( ఎఫ్.ఎమ్.డి ) సోకకుండా నివారణ టీకాలు వేసే కార్యక్రమాన్ని ఆయన స్వయంగా ప్రారంభించి, క్షేత్రస్థాయిలో పశువుల ఆరోగ్య పరిస్థితిని పర్యవేక్షించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవింద బాబు మాట్లాడుతూ వైద్య వృత్తిలో అపార అనుభవం ఉన్న నాయకుడిగా, వ్యాధి వచ్చాక చికిత్స కంటే, రాకుండా అడ్డుకోవడమే విజ్ఞత అని రైతులకు దిశానిర్దేశం చేశారు. గాలికుంటు వ్యాధి సోకడం వల్ల పశువులు తీవ్ర అస్వస్థతకు గురై, పాల దిగుబడి గణనీయంగా తగ్గిపోతుందని, ఇది పాడి రైతులను ఆర్థికంగా దెబ్బతీస్తుందని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వం ఉచితంగా అందిస్తున్న ఈ టీకాలను ప్రతి రైతు సద్వినియోగం చేసుకోవాలని, ఏ ఒక్క పశువు కూడా టీకా తీసుకోకుండా మిగిలిపోకూడదని అధికారులను కట్టుదిట్టంగా ఆదేశించారు. అనంతరం అర్వపల్లిలో నిర్వహించిన ప్రత్యేక పశువైద్య శిబిరం (మెడికల్ క్యాంపు ) లో కూడా ఎమ్మెల్యే పాల్గొని రైతులతో ముచ్చటించారు. తమ సమస్యలపై అవగాహన కలిగి, స్వయంగా గ్రామాలకు వచ్చి పశువుల ఆరోగ్య కార్యక్రమాల్లో పాల్గొంటున్న ఎమ్మెల్యే చొరవను అర్వపల్లి గ్రామస్తులు, పాడి రైతులు కొనియాడారు. డాక్టర్ అరవింద బాబు తమ ఎమ్మెల్యేగా ఉండటం తమ అదృష్టమని ఈ సందర్భంగా రైతులు హర్షం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో పశుసంవర్ధక శాఖ అధికారులు, స్థానిక నాయకులు, అధిక సంఖ్యలో రైతులు పాల్గొన్నారు.

01
ఇప్పుడు పెన్ పవర్ దిన పత్రికలో
క్లాసీఫైడ్ యాడ్స్
కేవలం
యాడ్ 100/-కే
' ఐదు రోజులకు '
'4 సెం.మీ 4 సెం.మీ'
'మరిన్ని వివరాలకు సంప్రదించండి '
93948 55244
షరతులు వర్తిస్తాయి

# వాహనం ఢీకొని బీహార్ కార్మికుడి మృతి




చిలకలూరిపేట రూరల్, పెన్ పవర్, ఏప్రిల్ 07: ఎడ్లపాడు: పోలీస్ స్టేషన్ పరిధిలోని వంకాయలపాడు జైన్ మందిరం వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో బీహార్‌కు చెందిన బాగీ బింద్ (తండ్రి: నాగ బింద్) అనే కార్మికుడు మృతి చెందాడు. ఉపాధి నిమిత్తం నిన్ననే వంకాయలపాడులోని బి ఆర్ ఎస్ స్తంభాల ఫ్యాక్టరీకి వచ్చిన అతడు, రాత్రి సమయంలో మద్యం సేవించి బోయపాలెం నుండి తిరిగి వస్తుండగా జాతీయ రహదారి-16 సర్వీస్ రోడ్డుపై గుర్తుతెలియని వాహనం ఢీకొట్టింది. తీవ్ర గాయాలతో గుంటూరు ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స పొందుతూ బాగీ బింద్ ప్రాణాలు కోల్పోయాడు. ఎడ్లపాడు ఎస్ఐ కేసు నమోదు చేసి, ప్రమాదానికి కారణమైన వాహనం కోసం దర్యాప్తు చేస్తున్నారు.

# ప్రభుత్వ పాఠశాలలు, అంగన్వాడీల్లో న్యూట్రి గార్డెన్ లు అభివృద్ధి చేయండి



పల్నాడు జిల్లా కలెక్టర్ కృతిక శుక్లా నరసరావుపేట పెన్ పవర్ ఏప్రిల్ 07: పల్నాడు జిల్లాలో అన్ని ప్రభుత్వ పాఠశాలలు, అంగన్వాడీల్లో న్యూట్రీ గార్డెన్ లు అభివృద్ధి చేయాలని జిల్లా కలెక్టర్ కృతిక శుక్లా అధికారులను ఆదేశించారు. మండలానికి ఒకటి చొప్పున కమ్యూనిటీ గార్డెన్ ను అభివృద్ధి చేయాలన్నారు. కమ్యూనిటీ గార్డెన్ ఏర్పాటు కోసం క్షేత్రాన్ని ఎంపిక చేయాలని డీపీవోను ఆదేశించారు. డ్వామా శాఖ కమ్యూనిటీ గార్డెన్ అభివృద్ధి, నిర్వహణ బాధ్యతలు చేపట్టాలన్నారు. డ్వాక్రా మహిళలకు కిచెన్ గార్డెన్, మిద్దె తోటల పెంపకంపై శిక్షణ ఇవ్వాలన్నారు. న్యూట్రి గార్డెన్ ల కార్యక్రమం కోసం మండల స్థాయి అధికారులకు ఈ వారంలోగా శిక్షణ పూర్తి చేయాలన్నారు. మంగళవారం స్థానిక కలెక్టరేట్ లోని ఎస్సార్ శంకరన్ వీడియో కాన్ఫరెన్స్ హాలునుంచి జిల్లా కలెక్టర్ కృతిక శుక్లా జలధార - జల హారతి, గ్రామ ఆరోగ్య దర్శిని, న్యూట్రి గార్డెన్ కార్యక్రమాలపై వెబెక్స్ ద్వారా సమీక్ష సమావేశం నిర్వహించారు.

# నరసరావుపేట రెండవ పట్టణ పోలీస్ స్టేషన్ పరిధిలో క్రికెట్ బెట్టింగ్ రాకెట్ గుట్టురట్టు -- 6 మంది అరెస్ట్





నరసరావుపేట పెన్ పవర్ ఏప్రిల్ 07: పల్నాడు జిల్లా పోలీస్ అధికారి కృష్ణారావు ఐపీఎస్ ఆదేశాల మేరకు సోమవారం సాయంత్రం జిల్లాలో జూదం, క్రికెట్ బెట్టింగ్ వంటి చట్టవిరుద్ధ కార్యకలాపాల నిర్మూలనలో భాగంగా కీలక చర్యలు చేపట్టి, నరసరావుపేట రెండవ పట్టణ పోలీస్ స్టేషన్ పరిధిలో క్రికెట్ బెట్టింగ్ నిర్వహిస్తున్న ఆరుగురు నిందితులను ప్రత్యేక విభాగ పోలీసులు అరెస్ట్ చేశారు. జిల్లాలో క్రికెట్ బెట్టింగ్, జూదం, పేకాట వంటి చట్టవిరుద్ధ కార్యకలాపాలకు పాల్పడితే ఎట్టి పరిస్థితుల్లోనూ ఉపేక్షించబోమని జిల్లా పోలీస్ అధికారి కృష్ణారావు గట్టిగా హెచ్చరించారు. బెట్టింగ్ నిర్వహించే వారితో పాటు సహకరించే వారిపై కూడా కఠిన చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు. బెట్టింగ్ నిర్వహణకు ఇళ్లు, గదులు, హోటళ్లు అందించిన వారిపై కూడా చట్టపరమైన కేసులు నమోదు చేస్తామని తెలిపారు. యువత క్రికెట్ బెట్టింగ్ వంటి వ్యసనాలకు దూరంగా ఉండి తమ సమయాన్ని విద్య, ఉపాధి, వ్యక్తిగత అభివృద్ధికి వినియోగించుకోవాలని సూచించారు.

కేసు వివరాలు:

షేక్ ఖాసింషా మరియు షేక్ మస్తాన్ వలి కలిసి క్రికెట్ మ్యాచ్‌లపై అక్రమంగా డబ్బులు సంపాదించేందుకు పథకం రచించారు. క్రికెట్‌పై ఆసక్తి ఉన్న వ్యక్తులను లక్ష్యంగా చేసుకుని, వారిని ప్రలోభపెట్టి బెట్టింగ్‌లో పాల్గొనేటట్లు ప్రోత్సహించారు. ఈ క్రమంలో పఠాన్ ఫైజర్ మరియు షేక్ జానీ వద్ద నుండి ఆన్లైన్ బెట్టింగ్ లింకులు పొందారు. వీరు భవనం కృష్ణారెడ్డి, పులి బాబుల్ రెడ్డి, గుజ్జుల ప్రభాకర్ రెడ్డి వద్ద నుండి లింకులు కొనుగోలు చేసి నెట్‌వర్క్‌ను విస్తరించారు అని చెప్పారు. విశ్వసనీయ సమాచారం మేరకు, 06-04-2026 రాత్రి సుమారు 8 గంటల సమయంలో నరసరావుపేటలోని ఐలా బజారులో ఉన్న షేక్ ఖాసింషా నివాసంలో పోలీసులు దాడి నిర్వహించారు.

ఈ దాడిలో ఆరుగురు నిందితులను అదుపులోకి తీసుకుని, రూ. 4,58,000 నగదు, 6 మొబైల్ ఫోన్లు, 1 ల్యాప్‌టాప్ స్వాధీనం చేసుకున్నారు.

నమోదైన కేసు వివరాలు:

కేసు సంఖ్య: 29/2026

చట్టపు విభాగాలు: భారత న్యాయ సంహిత 318(4), 112(2) మరియు 3(5) ఆంధ్రప్రదేశ్ జూదం చట్టం 3, 4

సమాచార సాంకేతిక చట్టం 66-డి



అరెస్టయిన నిందితులు:

షేక్ ఖాసింషా (55) ఐలా బజారు, నరసరావుపేట, షేక్ మస్తాన్ వలి (42) ఇస్లాంపేట, నరసరావుపేట, పసుపులేటి నాగరాజు (33) బాలయ్య నగర్, నరసరావుపేట, శిఖ చక్రవర్తి (45) కోటబజారు, నరసరావుపేట, షేక్ రఫీ జాన్ ఏ రఫీ (38) ముప్పాళ్ళ గ్రామం, పతేలా వెంకటేశ్వరరావు (35), మల్లాది గ్రామం, అమరావతి మండలం,

పరారీలో ఉన్న నిందితులు:

పఠాన్ ఫైజర్, షేక్ జానీ, భవనం కృష్ణారెడ్డి, పులి బాబుల్ రెడ్డి, గుజ్జుల ప్రభాకర్ రెడ్డి, పోలీస్ హెచ్చరికలు :

క్రికెట్ బెట్టింగ్, ఆన్లైన్ జూదం చట్టవిరుద్ధమైనవి. ఇందులో పాల్గొంటే జైలు శిక్షలు, జరిమానాలు విధించబడతాయి. ఇటువంటి కార్యకలాపాల వలన ఆర్థిక నష్టం మాత్రమే కాకుండా కుటుంబాలు కూడా తీవ్ర ఇబ్బందులు పడే అవకాశముంది.

అనుమానాస్పద బెట్టింగ్ కార్యకలాపాలు కనిపించిన వెంటనే సమీప పోలీస్ స్టేషన్‌కు లేదా 100 నంబర్‌కు సమాచారం ఇవ్వాలి అని కృష్ణారావు ఐపీఎస్ తెలిపారు. యువత సామాజిక మాధ్యమాలు, సందేశ యాప్స్ ద్వారా వచ్చే బెట్టింగ్ లింకుల పట్ల అప్రమత్తంగా ఉండాలన్నారు. అక్రమంగా సంపాదించిన డబ్బు ఎప్పటికీ నిలవదని గుర్తుంచుకోవాలన్నారు. ఈ కేసును ఛేదించిన నరసరావుపేట రెండవ పట్టణ సీఐ ప్రభాకర్, మహిళ ఉప నిరీక్షకురాలు యాష్ణ మరియు సిబ్బందిని నరసరావుపేట ఉప విభాగ అధికారి హనుమంతరావు ను అభినందించి నగదు బహుమతి అందజేశారు.


# ఏప్రిల్‌లోనూ పొగమంచు..!



పల్నాడు జిల్లా : పెన్ పవర్, ఏప్రిల్, 07: ఏప్రిల్ నెలలోనూ ఉదయం 7 గంటల సమయంలో కూడా దట్టమైన పొగమంచు కమ్ముకుని ఉండడం ఆశ్చర్యానికి గురి చేస్తుంది. దట్టమైన మంచు కారణంగా వాహనదారులు దూరం స్పష్టంగా కనిపించక ఇబ్బందులు పడుతున్నారు. ఉదయం చల్లగా ఉండగా మధ్యాహ్నం ఎండలు పెరగడం వల్ల ఆరోగ్య సమస్యలు తలెత్తే అవకాశం ఉంది. గాలిలో తేమ పెరగడం, రాత్రి ఉష్ణోగ్రతలు తగ్గడం వల్ల వాతావరణంలో ఇలాంటి మార్పులు వస్తుంటాయని నిపుణులు చెబుతున్నారు. పొగ మంచులో ప్రయాణించే వాహనదారులు అప్రమత్తంగా ఉండడంతో పాటు వాహనాల లైట్లు వేసుకుని ప్రయాణించడం శ్రేయస్కరం అని అధికారులు సూచించారు.

# దేవాదాయశాఖ అసిస్టెంట్ కమిషనర్ శాంతి అరెస్టు

గుంటూరు : పెన్ పవర్, ఏప్రిల్, 07: ఆదాయానికి మించిన కేసులో దేవాదాయశాఖ అసిస్టెంట్ కమిషనర్ కాళింగిరి శాంతిని ఎసిబి అధికారులు మంగళవారం అరెస్టు చేశారు. ఆమెపై వచ్చిన ఫిర్యాదు మేరకు తాడేపల్లి, ఉండవల్లి సహా నాలుగు ప్రాంతాల్లో ఏకకాలంలో ఎసిబి అధికారులు తనిఖీలు చేశారు. విశాఖ ఎండాడలో లగ్జరీ ఫ్లాట్, తాడేపల్లి కుంచనపల్లిలో రెండు అంతస్తుల భవనంతో పాటు 770 గ్రాముల బంగారు నగలు, మూడు కిలోల వెండి సోదాల్లో బయటపడింది. ఆమె ఇంట్లో రూ.1.15 లక్షల నగదు, బ్యాంకు ఖాతాల్లో రూ.మూడు లక్షల నగదు, వోక్స్‌వ్యాగన్ పోలో కారు,



ద్విచక్రవాహనాన్ని గుర్తించారు. విధి నిర్వహణలో అక్రమాలకు పాల్పడిన వ్యవహారంలో 2024 జులై నుంచి 2026 మార్చి వరకు సస్పెన్షన్‌లో ఉండగా ఇటీవల హైకోర్టు ఆదేశాలతో తిరిగి ఆమెను ప్రభుత్వం విధుల్లోకి తీసుకుంది.

# కార్మికులకు మార్చి నెల జీతం, పనిముట్లు తక్షణమే ఇవ్వాలి : సిఐటియు

చీరాల (బాపట్ల) : పెన్ పవర్, ఏప్రిల్, 07: కరోనా వంటి విపత్కర పరిస్థితుల్లోనూ ప్రాణాలను పణంగా పెట్టి విధులు నిర్వహించిన మున్సిపల్ కార్మికులకు మార్చి నెల జీతాలు ఇప్పటికీ చెల్లించకపోవడం వారి పట్ల నిర్లక్ష్య వైఖరినే సూచిస్తుందని సిఐటియు జిల్లా అధ్యక్షుడు ఎం. వసంతరావు విమర్శించారు. వెంటనే జీతాలు విడుదల చేయాలని డిమాండ్ చేశారు. మంగళవారం ఏపీ మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయిస్ ఫెడరేషన్ (సిఐటియు అనుబంధ సంఘం) ఆధ్వర్యంలో స్థానిక మున్సిపల్ కార్యాలయం వద్ద కార్మికులు ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సాధారణంగా ప్రతి నెల 1 లేదా 2వ తేదీల్లో జీతాలు చెల్లిస్తుండగా, మార్చి నెల జీతం ఏప్రిల్ 7వ తేదీ వచ్చినా ఇప్పటికీ అందలేదని ఆవేదన వ్యక్తం చేశారు. జీతాల ఆలస్యం కారణంగా కార్మికులు తీవ్ర ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలిపారు. ప్రపంచవ్యాప్తంగా జరుపుకునే ఈస్టర్ పండుగను కూడా మున్సిపల్ కార్మికులు సరిగా జరుపుకోలేకపోయారని పేర్కొన్నారు. తక్కువ వేతనాలతో పనిచేస్తున్న కార్మికులకు జీతాలు సకాలంలో రాకపోతే కుటుంబ పోషణ కష్టసాధ్యమవుతుందని అన్నారు.అదేవిధంగా మున్సిపల్ కార్మికులకు అవసరమైన పనిముట్లు,నెట్టుడు బండ్లు, చీపుర్లు, పారలు, సరిపడా అందుబాటులో లేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలిపారు. వాటిని తక్షణమే సమకూర్చాలని డిమాండ్ చేశారు.




అనంతరం మున్సిపల్ కమిషనర్ జోసఫ్ డానియిల్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో ఫెడరేషన్ బాపట్ల జిల్లా కార్యదర్శి జి. ఇమ్మానియేలు, నాయకులు చిమట వీరస్వామి, డి. సామేలు, బడుగు కుమారి, భవాని, యశోద, రాంబాబు, మరియమ్మ తదితరులు పాల్గొన్నారు.

# దివ్యాంగుల సమస్యల పరిష్కారానికి ప్రత్యేక గ్రీవెన్స్ : జిల్లా కలెక్టర్ కృతిక శుక్లా



పల్నాడు జిల్లా : పెన్ పవర్, ఏప్రిల్, 07: దివ్యాంగుల పట్ల ప్రతి ఒక్కరూ ఉదారతతో వ్యవహరించాలని జిల్లా కలెక్టర్ కృతిక శుక్లా పేర్కొన్నారు.వారిసమస్యలను నేరుగా పరిష్కరించేందుకు ప్రతి నెలనాలుగో శనివారం ప్రత్యేక గ్రీవెన్స్ నిర్వహిస్తామని తెలిపారు. మంగళవారం కలెక్టరేట్‌లో జిందాల్ చెత్త నిర్వహణ ప్లాంటు సంస్థ మంజూరు చేసిన సిఎస్ఆర్ నిధులతోకొనుగోలు చేసిన 13 ట్రై సైకిళ్లను దివ్యాంగులకు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూట్రై సైకిళ్లు దివ్యాంగుల స్వావలంబనకు తోడ్పడతాయని అన్నారు. దివ్యాంగులు ప్రభుత్వ సంక్షేమ పథకాలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో జిల్లా అధికారులు సంస్థ ప్రతినిధులు, లబ్ధిదారులు పాల్గొన్నారు.

# బుచ్చి పట్టణంలో కాలువల శుభ్రతకు శ్రీకారం

## ఎమ్మెల్యే ప్రశాంతి రెడ్డి ప్రత్యేక దృష్టి -- వార్డుల్లో విస్తృతంగా పూడికల తొలగింపు





బుచ్చిరెడ్డిపాలెం పెన్ పవర్ ఏప్రిల్ 7. పట్టణంలో పరిశుభ్రత, ప్రజా ఆరోగ్యంపై దృష్టి సారించిన స్థానిక ఎమ్మెల్యే ప్రశాంతిలి రెడ్డి ఆధ్వర్యంలో 7, 8 వ వార్డుల్లో గుడిపల్లి కాలువ శుభ్రపరిచే కార్యక్రమం జోరుగా కొనసాగుతోంది.కాలువల్లో పేరుకుపోయిన పూడికలను తొలగించడంతో నీటి పారుదల సాఫీగా సాగేందుకు చర్యలు తీసుకున్నారు.తొమ్మిదో వార్డు వైస్ చైర్మన్ యరటపల్లి శివకుమార్ రెడ్డి సహకారంతో, కో ఆప్షన్ దస్తగిరి టిడిపి మైనారిటీ నాయకులు షేక్ శుభహాని ఆధ్వర్యంలో ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు.కాలువల్లో పేరుకుపోయిన మట్టి, చెత్తను భారీ యంత్రాల సహాయంతో తొలగిస్తూ పరిసరాలను పరిశుభ్రంగా మార్చుతున్నారు.స్థానికులు చెబుతున్నదాని ప్రకారం, పూడికల వల్ల డ్రైనేజీ వ్యవస్థ సరిగా పనిచేయక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని, ఇప్పుడు ఈ చర్యలతో సమస్యకు శాశ్వత పరిష్కారం లభిస్తుందని ఆశాభావం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమాన్ని చూసిన వార్డు ప్రజలు ఎమ్మెల్యే ప్రశాంతి రెడ్డి, వైస్ చైర్మన్ శివకుమార్ రెడ్డి, టిడిపి కోఆప్షన్ నెంబర్ షేక్ దస్తగిరి యువ నాయకులు షేక్ శుభహాని అత్తర్ భాయ్ హనీఫ్ బృందాన్ని అభినందిస్తూ, ఇలాంటి కార్యక్రమాలు తరచూ నిర్వహించాలని కోరుతున్నారు.పరిశుభ్రతే ఆరోగ్యానికి మూలమని గుర్తుచేస్తూ, పట్టణంలో మరిన్ని అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టేందుకు అధికారులు సిద్ధంగా ఉన్నట్లు తెలిపారు

# పూల మార్కెట్ స్థల పరిశీలనలో మార్కెట్ కమిటీ చైర్మన్ రాజన్న



పలమనేరు,పెన్ పవర్, ఏప్రిల్ 07, పట్టణంలోని రైతు బజార్ కేంద్రం వద్ద మంగళవారం పూల మార్కెట్ కొరకు స్థల పరిశీలనలో వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ రాజన్న కమిటీ సభ్యులతో కలిసి పాల్గొన్నారు.ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ..ఇక్కడి వ్యాపారస్తులకు ప్రస్తుతం 11గదుల స్థలాలను కేటాయించామన్నారు. చిత్తూరు జిల్లా జాయింట్ కలెక్టర్ ఆదేశాల మేరకు సహాయ మార్కెటింగ్ సంచాలకులు పరమేశ్వరన్,డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజనీరు ఆధ్వర్యంలో మార్కెట్ కమిటీ కార్యాలయంలో డిప్ విధానంలో గదుల స్థలాలను కేటాయించారని,ప్రతి గది 10అడుగుల వెడల్పు,15 అడుగుల పొడవు విస్తీర్ణంతో ఉండగా వాటికి నెలకు రూ.2,403 చెల్లించాల్సి ఉంటుందని అధికారులు తెలిపారు. ఈ నిర్ణయంపై పూల వ్యాపారస్తులు సంతృప్తి వ్యక్తం చేస్తూ అధికారులకు కృతజ్ఞతలు తెలిపారు. అదేవిధంగా ప్రస్తుతం రైతుల వినియోగార్థం ఉన్న స్టాళ్లను ఉచితంగా వినియోగించుకోవాలని అధికారులు సూచించారు.రైతులకు అవసరమైన అన్ని వసతులు కల్పించబడతాయని, ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు.ఈ కార్యక్రమంలో పలమనేరు మార్కెట్ కమిటీ సభ్యులు శంకరప్ప,సెక్రటరీ సంజీవ్ కుమార్, సిబ్బంది జ్ఞానంబ, లీలా,లోకేష్ తదితరులు పాల్గొన్నారు.

# గురుకుల పాఠశాలలో విద్యార్థికి పాము కాటు

సంగం పెన్ పవర్ ఏప్రిల్ 7. సంగం గురుకుల పాఠశాలలో అనూష అనే ఐదవ తరగతి విద్యార్థి పాము కాటుతో ఆత్మకూరు లో జిల్లా ప్రభుత్వ వైద్యశాలలో చికిత్స పొందుతుంది.. బాత్రూంల వద్ద కాలకృత్యాలు తీర్చుకొని వస్తుండగా విద్యార్థిని అనూషను పాము కాటేసినట్టు విద్యార్థినీ అనూష, తల్లి తెలిపారు. సంగం వైద్యశాలలో చికిత్స చేయించుకొని ప్రస్తుతం మెరుగైన చికిత్స కొరకు ఆత్మకూరు వైద్యశాలకు వచ్చారు.. చీకటిలో గాయాన్ని పాము కాటేసినట్టుగా గుర్తించలేదని హాస్పిటల్ కి వచ్చిన తర్వాత ఇది పాముకాటుగా వైద్యులు గుర్తించి చికిత్స చేస్తున్నారు.. ప్రస్తుతం అనూషకు ప్రమాదం లేదని వైద్యులు తెలిపారు